క్లుప్తంగా

ఉగాది శుభాకాంక్షలు


ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : నియోజకవర్గంలోని ప్రజలకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలందరూ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. అలాగే ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, అద్భుత విజయాలను సాధించాలని బాలరాజు ఆకాంక్షించారు.

సువర్చలా హనుమద్ కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో స్వామి వారి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించగా అధిక సంఖ్యలో భక్తులు వీక్షించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ: 65,552 వచ్చినట్లు, 500 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి పాల్గొన్నారు.

శివపార్వతులకు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం : మాసశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో శివపార్వతుల పల్లకీ సేవను ఆలయ కమిటీ నిర్వహించింది. కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి విజయదుర్గ అమ్మవారికి, ప్రతి మాసశివరాత్రికి శివ పార్వతులకు పల్లకీసేవ నిర్వహించేందుకు ఆలయకమిటీ నిర్ణయించిందన్నారు. అలాగే ప్రతి సోమవారం పంచభూత మరకత లింగేశ్వరస్వామి వారికి, మరకత స్ఫటిక లింగానికి భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఆలయంలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాడా రామమోహనరావు, ఉపాధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనుల శ్రమదానం


విద్యుత్ స్తంభాలను నిలబెడుతున్న గిరిజనులు

బుట్టాయగూడెం : ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయడంలో ఆలస్యమవుతుందని గమనించి గిరిజనులే శ్రమదానంతో మంగళవారం ఆ స్తంభాలను నిలబెట్టారు. అలివేరు సర్పంచ్ కారం లక్ష్మి ఆధ్వర్యంలో రేగులపాడు, రేపల్లె గ్రామాలకు సంబంధించి గాలి, వానకు విరిగిన స్తంభాలను గోతులు తీసి నిలబెట్టారు. రేపల్లె, రేగులపాడు గ్రామాలు కొండ ప్రాంతంలో ఎత్తైన ప్రదేశంలో ఉన్నాయి. అక్కడికి వాహనాల్లో వెళ్లాలన్నా కష్టతరంగా మారుతుంది. స్తంభాలు విరిగి ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తిరిగి పునరుద్ధరించే విధంగా విద్యుత్ అధికారులకు సహకరిస్తూ గిరిజనులు శ్రమదానం చేశారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో రాగిజావను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


శ్రీనివాసపురంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ శ్రీనివాసరావు


రాజవరం హైస్కూల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, విద్యాశాఖ అధికారులు


చింతలపూడి సుబ్బరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లలకు రాగిజావను పంపిణీ చేస్తున్న దృశ్యం

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- పాఠశాలల్లో రాగి జావ పంపిణీ

జంగారెడ్డిగూడెం : విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం పరిరక్షణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే ఎలీజా రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో భాగంగా ఇకపై ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వారంలో మూడు రోజులు బెల్లంతో కూడిన రాగిజావ అందిస్తారన్నారు. రాగి జావా తీసుకోవడం వల్ల విద్యార్థులలో రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులకు పోషక విలువలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి విద్యార్థి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, స్థానిక కౌన్సిలర్ కఠారి వాసు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పచ్చిపాల మృత్యుంజయరాజు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సుధాకర్ రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ కట్టా శ్రీనివాస్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. 9వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు విద్యార్థులకు రాగిజావ అందించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. లక్కవరం హైస్కూల్‌లో సర్పంచ్ గెల్లా వెంకట రమణ చేతుల మీదుగా విద్యార్థులకు రాగి జావ అందించారు.

కొయ్యలగూడెం: రాజవరం జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం రవికుమార్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్యతో కలిసి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. విద్యార్థినులు వినూత్నంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటం వద్ద రాగి జావ గ్లాసులను అక్షరాకృతితో నిర్మించి జగన్ మేనమామకు కృతజ్ఞతలు తెలిపారు. కొయ్యలగూడెంలో ఎంపీపీ గంజిమాల రామారావు, పశ్చిమ డెల్టా బోర్డు చైర్ పర్సన్ గంజిమాల దేవి, వైస్ ఎంపీపీ మట్ట వనజలక్ష్మి, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి రాగిజావ పంపిణీ నిర్వహించారు. బయ్యన్నగూడెంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి విద్యార్థులకు రాగిజావ అందజేశారు.

చింతలపూడి : స్థానిక సుబ్బరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాఘవాపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. వెంకటాద్రిగూడెం మండల పరిషత్ పాఠశాలలో సర్పంచ్ ఆర్‌వి రామారావు, ఎంపీటీసీ కృష్ణారావు, విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు.

లింగపాలెం : శింగగూడెం హైస్కూల్లో విద్యార్థులకు జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. తోచలకరాయుడు పాలెం ఎంపీయూపీ స్కూల్‌లో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు విద్యార్థులకు రాగిజావ అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ విద్యార్థులకు రాగిజావ అందించారు. ఈస్టు యడవల్లి సర్పంచ్ పొన్నాల అనిత, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనుషా భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: కొమ్మర ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ప్రభాకరరావు విద్యార్థులకు రాగి జావను అందించారు. ఉపాధ్యాయులు లక్ష్మి, సల్మా బేగం, సరిత తదితరులున్నారు.

పోలవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ పాడుం పుష్ప విద్యార్థులకు రాగిజావ అందించారు. గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందించారు.

కుక్కునూరు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు సర్పంచ్ రావు మీనా రాగిజావ అందించారు. కార్యక్రమంలో రావు వినోద్, మల్లెల చంటినాయుడు, సూర్ల రాము, పెరెంట్ కమిటీ చైర్మన్ వాడపల్లి నాగశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ దారబోయిన లక్ష్మి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు సర్పంచ్ సునంద తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీడీఓ పి. శ్రీహరి, ఎంఈఓ టి. బాబూరావు విద్యార్థులకు రాగిజావ అందించారు. జీలుగుమిల్లి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, సర్పంచ్ సిర్రి జగదాంబ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.


శింగగూడెం హైస్కూల్‌లో రాగిజావ అందిస్తున్న జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు


కామవరపుకోటలో విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్


టి.నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న దృశ్యం


బుట్టాయగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ ఇస్తున్న జెడ్పీటీసీ రామతులసి

మహిళలకు కుట్టుమెషీన్ల అందజేత


మహిళలకు కుట్టుమెషీన్లు అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం : ములగలంపాడులో హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ఉచిత కుట్టు మెషీన్లను సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షురాలు సిస్టర్ మేరీ జయ మాట్లాడుతూ మహిళలు తమ స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. సిస్టర్ పుష్ప మాట్లాడుతూ 15 మంది మహిళలకు 8 నెలలు పాటు ఉచితంగా కుట్టుమిషన్‌పై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అంతేకాకుండా మహిళలకు చీరల పెయింటింగ్, అల్లికలు, ఫ్లవర్ జజ్ తయారీ వంటి వాటిపై ట్రైనింగ్ ఇచ్చి డిప్లమో సర్టిఫికెట్లతోపాటు ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో రంగాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ సందీప్, ములగలంపాడు విచారణ గురువు ఫాదర్ జీవరత్నం, మేరీ మెటల్డ్, టైలరింగ్ ఇన్‌చార్జి సిస్టర్ లీమా, సిస్టర్ శ్యామల, వేములపల్లి మహిళా సంఘాల సీఏ నత్తా జ్యోతి, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేతకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : యోగా, వ్యాయామం, క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, ప్రతి ఒక్కరు వీటిలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చని అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు గోరింట విజయ రామరాజు అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్‌లో మంగళవారం వ్యాయామ, యోగా అభిలాషులకు ఉగాది సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్రాంత బీఎస్ఎన్ఎల్ అధికారి బోడా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోరింట విజయ రామరాజు మాట్లాడుతూ పార్క్ అభివృద్ధికి క్షత్రియ సేవా సమితి చేసిన కృషి వివరించారు. అనంతరం యోగ, వ్యాయామం, క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహారాజు, యోగా మాస్టర్ దిలీప్ కుమార్, మానుకొండ రేష్మి(శాండీ), జ్ఞానేశ్వర్ రావు, వాలీబాల్ కోచ్ వెంకట్, పార్క్ వాచ్ మెన్ రామకృష్ణ దంపతులను సత్కరించారు.

ప్రపంచ కవితా దినోత్సవం

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ సామాజిక పరివర్తనకు కవితలు ఎంతో దోహదపడతాయన్నారు. మనిషిలో సృజనాత్మకతను, నైతిక విలువలను పెంపొందించడానికి కవితల అవసరం ఎంతైనా ఉంది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం : ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు సీహెచ్.వెంకటలక్ష్మి మొక్కలను కళాశాలకు అందజేయగా, ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడడానికి, కాలుష్యం నుంచి రక్షించడానికి అడవులు ఎంతో ఉపయోగపడతాయని, అందువలన ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కోరారు. అడవుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీని నిర్వహించి బహుమతులను అందజేశారు.

ఆటో వర్కర్ల యూనియన్ ఆందోళన

కొయ్యలగూడెం : రాజవరం, యర్రంపేట, గంగవరం పాయింట్లకు చెందిన శ్రీ వరసిద్ధి వినాయక ఆటో వర్కర్స్ యూనియన్ మంగళవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం చోటగిరి చిన్న అచ్చారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు హాజరయ్యారు. లైఫ్ టాక్స్ భారాన్ని తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో దేవరపల్లి సత్యనారాయణ, హోమం శీను, శంకరపు సుబ్బారావు, ఉసే జయరాజు, గరగపర్తి నాగేశ్వరావు, ముప్పిడి శ్రీను, రేలంగి రాజు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం


లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పంతగాని వెంకన్నను సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ పంకజాక్షన్ అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్లో జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న అధ్యక్షతన జోన్ సోషల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలో విశేష సేవలందించిన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. జిల్లా రెండవ వైస్ గవర్నర్ కాకరాల వేణుబాబు, జిల్లా కార్యదర్శి మద్దుకూరి శ్రీహరిరావు, రీజనల్ చైర్‌పర్సన్ చెన్నకేశవరెడ్డి, జిల్లా నాయకులు, ద్వారకాతిరుమల, దూబచర్ల, జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్‌లకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జోన్ చైర్మన్ పంతగాని వెంకన్నను ఘనంగా సత్కరించారు.

హైస్కూల్‌లో వివాదంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిపై దాడికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 10వ తరగతి చదువుతున్న విద్యార్థి తడికల తేజ పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల ప్రాంగణంలో బయట వ్యక్తులైన నాగిరెడ్డి సురేంద్ర, మద్దాల మంగరాజులను బయటకు వెళ్లాలంటూ తేజ సూచించాడు. దీంతో ఇరువర్గాల యువకుల మధ్య వివాదం తలెత్తింది. దీంతో సురేంద్ర, మంగరాజు బయటకు వెళ్లి కొద్దిసేపటి రాడ్డుతో వచ్చి తనపై దాడికి పాల్పడి గాయపర్చినట్లు తేజ ఫిర్యాదు చేశాడు.

విశేష అలంకరణలో నూకాలమ్మ దర్శనం


నూకాలమ్మ అమ్మవారు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి 59వ ఉగాది వార్షిక జాతరలో ఐదో రోజు మంగళవారం అమ్మవారు ప్రకృతి మాతగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉదయం ప్రభాతసేవలు, నిత్యపూజలు చేసిన అనంతరం 108 స్వర్ణపుష్పాలతో విశేష అర్చన, ఏకాదశ హారతులు ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ పురందరదాస భజన బృందంచే హనుమాన్ చాలీసా, శ్రీలలితా సహస్రనామ పారాయణం కోలాటం జరిగాయి. బుధవారం ఉగాది సందర్భంగా విశేష అలంకరణలో అమ్మవారి దర్శనం, ఉగాది పచ్చడి వితరణ, గోపూజ అనంతరం ద్వారకాతిరుమలకు చెందిన భమిడిపాటి వెంకట లక్ష్మీనారాయణశర్మ గారిచే ఆలయకమిటీ నిర్వహణలో పంచాంగ శ్రవణ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

చింతలపూడి : వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎంపీపీ డా రాంబాబు నాయక్ ఆదేశించారు. రాఘవాపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో జరిగింది. పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి, మండల వైద్యాధికారి డా.కిరణ్ చైతన్య, సర్పంచ్ వజ్ర కిషోర్ పాల్గొన్నారు.

విలేకరులమంటూ బెదిరింపులపై ఆందోళన

కొయ్యలగూడెం: ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల బేస్‌మెంట్ల వద్దకు విలేకరులంటూ కొందరు వచ్చి బెదిరింపులకు పాల్పడుతుండడంపై ఇళ్ల నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. మంగళవారం సుమారు పదిమందికి పైగా విలేకరులు వచ్చి మట్టితోల కందారుడుతో సహా నిర్మాణదారులను బెదిరించారు. తామంతా మీడియాకు చెందిన వ్యక్తులమని రూ.50 వేలు ఇస్తే మట్టితోలకానికి అడ్డు తగలమని బాహాటంగా పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై నల్లజర్ల మండలం నుంచి మట్టి తోలకానికి అనుమతులు పొందిన వ్యక్తి మాట్లాడుతూ విలేకరులుగా పేర్కొంటున్న వారికి ఏవిధమైన గుర్తింపు కార్డులు లేకుండా పరిసర గ్రామాలలో హల్‌చల్ చేస్తున్నారన్నారు. యర్రంపేట పంచాయతీ పరిధిలోనూ, పొంగుటూరు, రాజవరం, గవరవరం, పంచాయతీల పరిధిలో నకిలీ విలేకరుల దందాలు పెచ్చుమీరాయని వాపోతున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.